E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

24-3-2025 సోమవారం | పేజీలు–6 | హైదరాబాద్

ekaburu.com



పది పద్దులు... రెండు బిల్లులు

2లో



## రాష్ట్రాలతో చర్చించాకే డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలి: కేకే

అన్ని రాష్ట్రాలతో చర్చించాకే కేంద్రం డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు.

3లో



## దక్షిణాదికి తీవ్ర నష్టం

"లోక్‌సభలో సీట్ల సంఖ్యను జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే అది దక్షిణాదికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. మేం దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోం. ఎందుకంటే అది దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపు అవుతుంది"



### కేసీఆరే మళ్లీ వస్తే బాగుంటుందని

## రైతులు కోరుకొంటున్నారు

కాంగ్రెస్‌కు ఓటేసి తప్పుచేశామని రాష్ట్ర ప్రజలంతా బాధపడుతున్నారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

**ఈ-కబురు [కరీంనగర్]:** కాంగ్రెస్‌కు ఓటేసి తప్పుచేశామని రాష్ట్ర ప్రజలంతా బాధపడుతున్నారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేసీఆరే మళ్లీ వస్తే బాగుంటుందని రైతులు కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవాల కోసం కరీంనగర్‌లో నిర్వహించిన సన్నాహక సభలో కేటీఆర్ మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు.

భాజపా, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ మోసం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణవాదం ఎక్కడుందని వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే.. రాజీనామా చేసిన కేసీఆర్‌ను గెలిచిపించి చూపించింది కరీంనగర్‌వాసులేనని గుర్తు చేశారు. భారాస, కేసీఆర్ కుటుంబంపై అసూయ, ద్వేషంతో దుష్ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ దుయ్యబట్టారు.

## 'కాంగ్రెస్ సర్కార్ అసమర్థ పాలనతోనే రైతులకు కష్టాలు



2లో

### ఉగాది నుంచి నాణ్యమైన

# సన్న బియ్యం పంపిణీ

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం – మార్చి 30న సీఎం రేవంత్ ప్రారంభోత్సవం



ఏప్రిల్ నుంచి రేషన్ కార్డుదారులకు నెలకు 6 కేజీల సన్న బియ్యం 84% ప్రజలకు లబ్ధి

చేకూరే పథకం – మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దొడ్డు బియ్యం స్థానంలో నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ

ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు


**తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మార్చి 30న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ఏప్రిల్ నుంచి రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి నెలకు ఆరు కేజీల సన్న బియ్యం అందిస్తారు.**

**ఈ-కబురు:** రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మార్చి 30వ తేదీన హుజూర్ నగర్ పట్టణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వచ్చే ఏప్రిల్

2లో

# రైతులు ఆందోళన చెందొద్దు..

### అకాల వర్షాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు



**ఈ-కబురు [అమరావతి]:** రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగళ్ల వర్షాలతో పలు జిల్లాల్లో జరిగిన పంట నష్టంపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షించారు. వడగళ్ల వాన కారణంగా కడప, అనంతపురం, సత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని 10 మండలాల్లో 40 గ్రామాల్లో పంటనష్టం జరిగిందని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. మొత్తం 1,364 మంది రైతులకు చెందిన 1,670 హెక్టార్లలో హార్టికల్చర్ పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు.

అకాల వర్షాలు, వడగళ్ల వర్షాలతో జరిగిన పంటనష్టం వివరాలను క్షేత్రస్థాయి పర్యటన ద్వారా పరిశీలించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. వారికి ప్రభుత్వ పరంగా సాయం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని.. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

**రైతుల ఆత్మహత్యాయత్నంపై సీఎం ఆరా**

అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నీర్జంపల్లిలో ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. జిల్లా అధికారులతో మాట్లాడిన ఆయన.. ఆ రైతులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. శనివారం కురిసిన వడగళ్ల వానతో పంట నష్టపోయిన అరటి రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్ప ఆత్మహత్యకు ప్రయత్నించారు. దీంతో వారిని హుటాహుటిన అనంతపురం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## మాజీ మంత్రి విడదల రజినిపై ఏసీబీ కేసు

2లో



## హుటాహుటిన ఢిల్లీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పయనం



**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు.**

**ఈ-కబురు [హైదరాబాద్]:** తెలంగాణ భాజపా అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. తన షెడ్యూల్ ప్రోగ్రామ్ రద్దు చేసుకొని మరీ హస్తిన బయల్దేరి వెళ్లారు. హఠాత్తుగా కిషన్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

అంతకుముందు హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన కిషన్ రెడ్డి నిన్న చెన్నైలో డీలిమిటేషన్‌పై జరిగిన సదస్సుపై స్పందించారు. ఆ సదస్సుతో కాంగ్రెస్, భారాస పాత బంధం బయటపడిందని ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్, భారాస అసత్య ప్రచారం చేస్తున్నాయంటూ మండిపడ్డారు. డీలిమిటేషన్‌పై కేంద్ర ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న ఆయన.. స్టాలిన్ ప్రభుత్వం పట్ల తమిళనాడు ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నందునే డీలిమిటేషన్, భాష పేరుతో ఆయన ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.



## ముంబయి ఓటమి.. బోణీ కొట్టిన చెన్నై సూపర్ కింగ్స్

6లో



## సన్‌రైజర్స్ అదరగొట్టింది.. రాజస్థాన్‌పై ఘన విజయం

## శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ, ఆలయ అర్చకులు ఆహ్వానించారు.

2లో

## గాజా మృత్యుఘోష.. 50వేలు దాటిన మరణాలు

**ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50వేల మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది.**

**ఈ-కబురు :** ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50వేల మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మరో 1.13లక్షల మంది గాయపడినట్లు తెలిపింది. ఇటీవల కాల్పుల విరమణ ముగిసిన తర్వాత వారం వ్యవధిలోనే మళ్లీ దాడులు మొదలుకాగా.. వీటిలో దాదాపు 673 మంది చనిపోయారు. అయితే, మొత్తం మరణించిన వారిలో సామాన్య పౌరులు,

తరువాయి 2లో





# ఉగాది నుంచి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ

**మొదటి పేజీ తరువాయి**

నెల నుంచి నెలకు ఆరు కేజీల సన్న బియ్యం అందజేస్తామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ పథకంతో రాష్ట్రంలోని సుమారు 84 శాతం మంది ప్రజలు లబ్ధి పొందుతారని స్పష్టం చేశారు. గతంలో రేషన్ ద్వారా అందజేసిన దొడ్డు బియ్యం (మోట బియ్యం) ప్రజలకు అంతగా నచ్చకపోవడంతో, దాన్ని అమ్మేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. కానీ సన్న బియ్యం పంపిణీ ద్వారా ప్రజల ఆహార భద్రతను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రజలు స్వచ్ఛమైన, నాణ్యమైన బియ్యాన్ని తినే అవకాశాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు పోషకాహారం అందించేందుకు, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఆయన తెలిపారు. నీటి, పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించడం తన అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం కృష్ణా నదీ జలాల్లో కొంత మేర నీటి కొరత నెలకొన్నా, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.



## శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

**ఈ-కబురు [హైదరాబాద్]:** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ, దేవస్థానం అర్చకులు ఆహ్వానించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును మంత్రి కొండా సురేఖ ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ సహా ఇతర వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ, నిధులకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని ఈ సందర్భంగా అధికారుల్ని ఆదేశించారు.



## అమెరికాలో కాల్పులు.. భారత్‌కు చెందిన తండ్రీ కుమార్తె మృతి

**అమెరికాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో భారత్‌కు చెందిన తండ్రీ కుమార్తె మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.**

**ఈ-కబురు [వర్జీనియా]:** అమెరికాలో ఇద్దరు భారతీయులపై కాల్పులు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వర్జీనియాలోని ఓ డిపార్టుమెంటల్ స్టోర్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో అక్కడే పనిచేస్తున్న భారత్‌కు చెందిన ఊర్మి (24), ఆమె తండ్రి ప్రదీప్ పటేల్ మృతిచెందారు. కాల్పులకు తెగబడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం మద్యం కొనేందుకు స్టోర్‌కు వెళ్లిన దుండగుడు ముందురోజు రాత్రి స్టోర్‌ను ఎందుకు మూసివేశారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెంటనే కాల్పులు జరపగా.. ప్రదీప్ పటేల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఊర్మి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలు విడిచింది. భార్య, కుమార్తెతో కలిసి ఆరేళ్ల క్రితం ప్రదీప్ పటేల్ గుజరాత్ నుంచి అమెరికా వెళ్లినట్లు సమాచారం

## గాజా మృత్యుఘోష.. 50వేలు దాటిన మరణాలు

**మొదటి పేజీ తరువాయి**

యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై గాజా ఆరోగ్యశాఖ స్పష్టత ఇవ్వలేదు. అయితే, ఇజ్రాయెల్ మాత్రం దాదాపు 20వేల మంది మిలిటెంట్లను చంపినట్లు పేర్కొంది.కాల్పుల విరమణ ముగిసిన తర్వాత మళ్లీ దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్.. తాజాగా దక్షిణ గాజాపై భీకర దాడులకు పాల్పడుతోంది. శనివారం రాత్రి జరిపిన దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్ రాజకీయ నేత సహా పలువురు మహిళలు, చిన్నారులు చనిపోయారు. రఫా నగరాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటికే ఆదేశించింది. దీంతో పాలస్తీనావాసులు తమ సామగ్రిని పట్టుకొని దుమ్ము రోడ్లపై బారులు తీరిన పరిస్థితి కనిపించింది.

# పది పద్దులు... రెండు బిల్లులు

**నేడు అసెంబ్లీలో వార్షిక బడ్జెట్‌పై చర్చ**
**డీలిమిటేషన్‌పై తీర్మానం కూడా..**
**మున్సిపల్, పంచాయతీరాజ్ బిల్లులకు సవరణల ప్రతిపాదన**

**ఈ-కబురు హైదరాబాద్:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ఎనిమిదోరోజు సోమవారం 2025-26 వార్షిక బడ్జెట్ పద్దులపై చర్చ కొనసాగనుంది. పురపాలక, సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమం, పరిశ్రమలు, ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా,శిశు సంక్షేమం, వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖల కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పద్దులపై సభ్యులు చర్చించనున్నారు. ఈ పద్దులపై చర్చతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రెండు బిల్లులను ప్రవేశపెట్టనుంది.

మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన రెండు బిల్లుల్లో సవరణలను ప్రతిపాదించనుంది. దీంతో పాటు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంలో కూడా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలుస్తోంది. మరో 25 ఏళ్ల వరకు పాత పద్ధతినే కొనసాగించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెడతారని, దీనిపై చర్చ అనంతరం ఆమోదించి కేంద్రానికి పంపుతామని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.





## 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్ స్టార్టింగ్.. ఎండింగ్ పాయింట్ ఎక్కడ ఉందో తెలుసా?'

**ఈ-కబురు [ సూర్యాపేట జిల్లా]:** కేటీఆర్ ఓ పిలగాడంటూ వ్యాఖ్యానించారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. పదేళ్లు దక్షిణ తెలంగాణను కేసీఆర్ ముంచాడని.. కేటీఆర్‌కు జిల్లాకు వచ్చే హక్కే లేదంటూ వ్యాఖ్యానించారు. పాలకవీడు మండలం జానపహాడ్ లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి మీడియా సమావేశంలో నిర్వహించారు.

ఈ సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ స్టార్టింగ్.. ఎండింగ్ పాయింట్ ఎక్కడ ఉందో జగదీష్ రెడ్డికి తెలుసా అంటూ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు జిల్లా పరిషత్‌లను గెలుస్తాం. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని వైఎస్సార్ చొరవతో ప్రారంభించుకున్నాం. ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం బాధాకరం. ఎస్ఎల్‌బీసీ సొరంగంపై రేపు (సోమవారం) సీఎం సమీక్షించనున్నారు. 85 శాతం పూర్తయిన బ్రాహ్మణ వెల్లంలను కేసీఆర్ పూర్తి చేయలేదు'' అని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 30న ఉగాది నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇస్తున్నామని.. సీఎం చేతుల మీదుగా హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి పథకాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. 80 శాతం ప్రజలు రేషన్ బియ్యాన్ని తినడం లేదు. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు అమ్ముకుంటున్నారు. తెలంగాణలో 84 శాతానికి సన్నబియ్యం ఉచితంగా ఇవ్వబోతున్నాం'' అని ఉత్తమ్ తెలిపారు.

## 'కాంగ్రెస్ సర్కార్ అసమర్థ పాలనతోనే రైతులకు కష్టాలు: హరీష్‌రావు



**ఈ-కబురు , సిద్దిపేట:** అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో నిన్న(శనివారం) రాత్రి కురిసిన వర్షాలు, వడగండ్ల కారణంగా దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు.

అనంతరం హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. రైతు బంధు రూపంలో కేసీఆర్ రైతులకు నేరుగా సాయం చేశారు. వానా కాలం యాసంగి రైతుబంధు రూ. 15 వేలు వెంటనే విడుదల చేయాలి. పంటల బీమా ఉండే రైతులకు ఇంత నష్టం ఉండేది కాదు. రైతులకు మూడు పంటల బీమా రాలేదు. రుణమాఫీ చేయలేదు ఇచ్చామని.. అబద్ధాలు ఆడుతున్నారు'' అని కాంగ్రెస్‌పై హరీష్‌రావు మండిపడ్డారు.

''రేవంత్ రెడ్డి అన్ని అబద్ధాలు ఆడుతున్నారు. ఎండల వల్ల పంటలు ఎండటం లేదు. కాంగ్రెస్ అసమర్థ పాలన వల్ల నీళ్లులేక పంటలు ఎండిపోతున్నాయి. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆర్థిక సాయం చేసి అందుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి'' అని హరీష్‌రావు పేర్కొన్నారు.

## మొదటి పంట కాలంలోనే రూ.2 లక్షల వరకు రుణమాఫీ



**రైతులకు ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలన్నింటినీ మొదటి పంటకాలంలోనే మాఫీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**

**ఈ-కబురు , హైదరాబాద్:** రైతులకు ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలన్నింటినీ మొదటి పంటకాలంలోనే మాఫీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో అస్తవ్యస్త ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ సాహసోపేతంగా రూ.20,616.89 కోట్ల రుణాలను మాఫీ చేసి, 25,35,964 మంది రైతులకు రుణ విముక్తి కల్పించి నిబద్ధతను చాటుకుందని వివరించారు. రుణమాఫీ పథకాన్ని అమలు చేయలేక రెండు పర్యాయాలు చేతులెత్తేసిన భారాస నేతలకు తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతికహక్కు లేదన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడారు. ''రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని 2014లో హామీ ఇచ్చిన భారాస ప్రభుత్వం.. దాని అమలులో నాలుగేళ్లపాటు జాప్యం చేసింది. ఫలితంగా రైతులపై రూ.2,630 కోట్ల వడ్డీ భారం పడింది. 2018లో కూడా రుణమాఫీ పథకాన్ని నాలుగేళ్లు ఆపి ఆఖరి సంవత్సరంలో ఎన్నికలకు ముందు సగం మందికే అమలు చేసింది. గత ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మా ప్రభుత్వం 2024లో రుణమాఫీ పథకాన్ని అమలు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. అందుకు మా ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి విమర్శించడం భారాస కుటిలబుద్ధికి నిదర్శనం. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ఈ సంవత్సరం పునరుద్ధరిస్తున్నాం. ఇష్టారాజ్యంగా మాట్లాడితే భారాస నేతలను ప్రజలే తరిమికొడతారు'' అని తుమ్మల పేర్కొన్నారు.

## తాత్కాలిక వలసదారులపై ట్రంప్ కొరడా



**అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి వారిని స్వదేశాలకు పంపిస్తోన్న అమెరికా ఇప్పుడు తాత్కాలిక వలసదారులకున్న చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయాలని నిర్ణయించింది.**

**మియామీ:** అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి వారిని స్వదేశాలకు పంపిస్తోన్న అమెరికా ఇప్పుడు తాత్కాలిక వలసదారులకున్న చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల నాలుగు దేశాలకు చెందిన 5.32 లక్షల మంది వారి స్వదేశాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఎదురుకానుంది. క్యూబా, హైతీ, నికరాగువా, వెనెజువెలా దేశాల నుంచి వచ్చిన వలసదారులకు చట్టపరంగా ఉన్న తాత్కాలిక రక్షణను రద్దు చేస్తున్నట్లు హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్లు తెలిపింది. మానవతా పెరోల్ కార్యక్రమం కింద 2022 అక్టోబరు తర్వాత ఆ నాలుగు దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చిన వారికి ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి. వీరంతా ఇతరుల ఆర్థిక సహకారంతో అమెరికాకు వచ్చారని, రెండేళ్ల పాటు యూఎస్‌లో నివసించడానికి, పని చేయడానికి తాత్కాలిక అనుమతులు పొందారని హోమ్‌లాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. వీరు ఏప్రిల్ 24న లేదా ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత అగ్రరాజ్యంలో ఉండేందుకు లభించిన చట్టపరమైన రక్షణను కోల్పోనున్నారని తెలిపారు.

**ఒక్క రోజే 1000 గోల్డ్ కార్డుల అమ్మకం**

ఇంటర్నెట్ డెస్క్: డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన గోల్డ్ కార్డుకు భారీ స్పందన లభించింది. ఒక్క రోజే 1000 కార్డులను విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5 బిలియన్ డాలర్లు సేకరించామని తెలిపారు. లక్షల మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# వాళ్లు బ్రిటిష్‌వాళ్ల కంటే దారుణం - కేజ్రీవాల్

**ఎన్నికల హామీలను నెరవేర్చడంలో భాజపా విఫలమైందని కేజ్రీవాల్ ఆరోపించారు.**

**ఇంటర్నెట్ డెస్క్:** ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ భాజపాపై మరోసారి విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్, సంఘ సంస్కర్త అంబేడ్కర్ వారసత్వాన్ని కాషాయపార్టీ విస్మరిస్తోందని మండిపడ్డారు. వారి తీరు బ్రిటిష్‌వాళ్ల కంటే దారుణంగా ఉందన్నారు. 'ఏక్ శామ్ షహీదోంకే నామ్' పేరుతో దిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన కేజ్రీవాల్.. తమ పార్టీ మాత్రం భగత్‌సింగ్, అంబేడ్కర్‌ల ఆశయాలను నెరవేర్చేందుకే రాజకీయాల్లోకి వచ్చిందన్నారు. ''బాబాసాహెబ్ అంబేడ్కర్, భగత్ సింగ్‌లు మాకు ఆదర్శం. మా కార్యాలయంతోపాటు పంజాబ్‌లోని ప్రతి ఆఫీసులో వారి ఫొటోలే ఉంటాయి. దిల్లీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ ఫొటోలను తొలగించి వారికి నచ్చిన వాళ్లవి పెట్టుకున్నారు. గాంధీజీ చిత్రపటం లేదని విమర్శించిన కాంగ్రెస్ కూడా ఇప్పుడు మౌనంగా ఉంది. ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయి'' అని కేజ్రీవాల్ ఆరోపించారు. భాజపాను ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించిన ఆయన.. ప్రస్తుత పాలకులు బ్రిటిష్ కంటే దారుణంగా ఉన్నారని మండిపడ్డారు. దిల్లీలో బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించేందుకు భాజపా ప్రభుత్వం నిరాకరిస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకోకుంటే కండక్టర్లు పింక్ టికెట్ ఇవ్వడం లేదన్నారు. సౌకర్యాలు కల్పించకపోగా.. గతంలో ఉన్న వాటిని ఉపసంహరించుకుంటున్నారని అన్నారు. ఇప్పటికే మహిళలకు రూ.2500 ఇవ్వాల్సి ఉందని, కానీ ఇంకా ఆ కార్యక్రమం ప్రారంభించలేదన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో భాజపా విఫలమైందని కేజ్రీవాల్ ఆరోపించారు.





# రాష్ట్రాలతో చర్చించాకే డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలి: కేకే

**అన్ని రాష్ట్రాలతో చర్చించాకే కేంద్రం డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు.**

**ఈ-కబురు [హైదరాబాద్]:** అన్ని రాష్ట్రాలతో చర్చించాకే కేంద్రం డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు. ఆదివారం ఆయన బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ అంశంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. పార్లమెటులో చట్టం ఆమోదం పొందాకే కేంద్రం డీలిమిటేషన్ చేయాలన్నారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం ఇంకా పెరగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కొన్ని రాష్ట్రాలు కేవలం సీట్లు గురించి మాత్రమే పోరాడటం లేదు.. పార్లమెంటులో తమ గళానికి ప్రాధాన్యత ఉండాలని అంటున్నాయని కేకే అన్నారు.
డీలిమిటేషన్‌పై డీఎంకే చీఫ్, తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో సమావేశం జరిగినప్పటికీ.. అందులో రేవంత్ రెడ్డి పాత్ర అద్భుతంగా ఉందని.. ఆయన హీరోలా వ్యవహరించారని కేకే ప్రశంసించారు. కేంద్రం డీలిమిటేషన్‌పై ఎలాంటి ఆలోచన చేయడం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెబుతున్నారని.. అసలు ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. ''జనాభా తగ్గించాలని మనమే అనుకున్నాం. ముగ్గురు పిల్లలు ఉంటే పోటీ చేయకూడదు అనుకున్నాం. ఆ క్రమంలో దక్షిణాదిలో జనాభా తగ్గిపోయింది. రాష్ట్రాల అధికారాలకనుగుణంగా డీలిమిటేషన్ ఉండాలని రాహుల్ గాంధీ చెప్పారు. దక్షిణాదికి 33శాతం సీట్లు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. చెన్నైలో సమావేశానికి దాదాపు అన్ని పార్టీలు పాల్గొనడం సంతోషంగా ఉంది. జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రాల ప్రాతిపదికన ఎంపీ సీట్లు కేటాయించాలి'' అన్నారు.
కేంద్రానికి రాష్ట్రం పంపించే నిధులపై, రాష్ట్ర అధికారాలపై మాట్లాడుతున్నామని ఈ సందర్భంగా కేకే అన్నారు. గత కొన్నేళ్లుగా దక్షిణాదిన జనాభా తగ్గుతుండగా.. ఉత్తరాదిన మాత్రం పెరుగోతందన్నారు. తద్వారా ఇప్పుడు దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

# మాజీ మంత్రి విడదల రజినిపై ఏసీబీ కేసు



**జగన్ హయాంలో పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్ యజమాన్యాన్ని విజిలెన్స్ తనిఖీల ముసుగులో బెదిరించి.. రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారనే అభియోగంపై వైకాపా నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజిని, అప్పటి గుంటూరు ఆర్‌వీఈవో, ఐపీఎస్ అధికారి పల్లె జాషువాతో పాటు మరికొందరిపై ఏసీబీ కేసు నమోదు చేసింది.**

**స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి రూ.2.20 కోట్ల వసూలు**
**రెండో నిందితుడిగా ఐపీఎస్ అధికారి పల్లె జాషువా**
**రజిని వాటా రూ.2 కోట్లు**
**ఆమె మరిది గోపి, జాషువాలకు చెరో రూ.10 లక్షలు**
**వైకాపా హయాంలో దందా**

**ఈనాడు, అమరావతి:** జగన్ హయాంలో పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్ యజమాన్యాన్ని విజిలెన్స్ తనిఖీల ముసుగులో బెదిరించి.. రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారనే అభియోగంపై వైకాపా నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజిని, అప్పటి గుంటూరు ఆర్‌వీఈవో, ఐపీఎస్ అధికారి పల్లె జాషువాతో పాటు మరికొందరిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. లంచం తీసుకోవటం, అనుచిత లబ్ధి కలిగించటం, నేరపూరిత కుట్ర, బెదిరింపు తదితర అభియోగాలపై అవినీతి నిరోధక చట్టంలోని 7, 7ఏ, ఐపీసీలోని 384, 120బీ సెక్షన్లు వర్తింపజేస్తూ కేసు పెట్టింది. ఏ1గా విడదల రజిని, ఏ2గా ఐపీఎస్ అధికారి పల్లె జాషువా, ఏ3గా విడదల రజిని మరిది విడదల గోపి, ఏ4గా రజిని పీఏ దొడ్డ రామకృష్ణలను నిందితులుగా చేర్చింది. ఈ బెదిరింపులు, అక్రమ వసూళ్లపై తొలుత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు అందగా.. ఆ విభాగం డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా విచారణ జరిపించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఆయన సిఫార్సు మేరకు ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ ప్రాథమిక దర్యాప్తు చేయించారు. ఆధారాలు లభించటంతో శనివారం కేసు నమోదు చేశారు. అందులోని ప్రధానాంశాలివి.

'2020 సెప్టెంబరు 4న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిక గ్రామంలోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్‌ను అప్పటి చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని పీఏ దొడ్డ రామకృష్ణ సందర్శించారు. స్టోన్‌క్రషర్‌పై దాడులు చేయకుండా, మూయించకుండా ఉండాలంటే రజినిని కలవాలని హుకుం జారీ చేశారు. దీంతో దాని యజమానులు నల్లపనేని చలపతిరావు, నంబూరి శ్రీనివాసరావు రజిని కార్యాలయానికి వెళ్లి కలిశారు. తన నియోజకవర్గ పరిధిలో వ్యాపారం నడవాలంటే అడిగినంత డబ్బులివ్వాల్సిందేనని, మిగతా విషయాలు తన పీఏ రామకృష్ణతో మాట్లాడాలని రజిని వారితో చెప్పారు. వారిద్దరూ రామకృష్ణను కలవగా ఆయన రూ.5 కోట్లు డిమాండ్ చేశారు.

**విజిలెన్స్ తనిఖీలతో జాషువా హడావుడి**
ఆ తర్వాత 6 రోజులకే సెప్టెంబరు 10న అప్పటి గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఆర్‌వీఈవో)గా ఉన్న ఐపీఎస్ అధికారి పల్లె జాషువా భారీ బృందంతో శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్‌లో తనిఖీలకు వెళ్లి హడావుడి చేశారు. ఆ స్టోన్ క్రషర్‌పై ఎవరూ ఫిర్యాదు చేయకుండానే విచారణకు వెళ్లారు. అప్పటి విజిలెన్స్ డీజీ అనుమతి కూడా తీసుకోలేదు. విజిలెన్స్ ప్రధాన కార్యాలయానికి ఈ తనిఖీల సమాచారమే ఇవ్వలేదు. విచారణలో వెల్లడైన అంశాలతో నివేదిక సిద్ధం చేశారు. ప్రభుత్వ ఖజానాకు ఎంత నష్టం వాటిల్లిందనేది అందులో లేదు. ఈ నివేదిక డీజీకీ సమర్పించలేదు. అప్పట్లో ఈ తనిఖీల్లో పాల్గొన్న మిగతా అధికారులను ఏసీబీ విచారించగా.. జాషువా ఆదేశాలతోనే తామంతా తనిఖీల్లో పాల్గొన్నామని, తర్వాత విచారణ ఏమైందో కూడా తెలీదని వాంగ్మూలాలిచ్చారు.

**రూ.50 కోట్ల జరిమానా చెల్లించాలంటూ బెదిరింపులు**
స్టోన్‌క్రషర్‌లో తనిఖీలు జరిపిన నెల రోజుల తర్వాత జాషువా.. దాని యజమానులకు ఫోన్ చేశారు. వెంటనే విడదల రజినిని కలవాలని.. లేకపోతే రూ.50 కోట్లు జరిమానా విధించటంతో పాటు క్రషర్‌ను మూయించేస్తానని బెదిరించారు. దీంతో వారు రజినిని కలిశారు. ఆమె ఆదేశాల మేరకు పీఏ రామకృష్ణతో భేటీ కాగా ఆయన రూ.5 కోట్లు ఇవ్వాల్సిందేనని మరోమారు డిమాండు చేశారు. కొన్నాళ్ల తర్వాత జాషువా మరోసారి క్రషర్ యజమానులను తన కార్యాలయానికి పిలిపించుకుని, త్వరగా సెటిల్ చేసుకోవాలని హెచ్చరించారు.
ఆయన నుంచి ఒత్తిడి పెరగడంతో స్టోన్‌క్రషర్ యజమానులు రజిని ఆదేశాల మేరకు.. 2021 ఏప్రిల్ 4వ తేదీ రాత్రి ఆమె మరిది విడదల గోపిని పురుషోత్తపట్నంలోని ఆయన నివాసంలో కలిసి రూ.2 కోట్లు ఇచ్చారు. అదే రోజు గుంటూరులో జాషువాకు రూ.10 లక్షలు, గోపిని కలిసి మరో రూ.10 లక్షలు చెల్లించారు. విడదల రజిని ఆదేశాల మేరకే తాము తనిఖీలు చేపట్టినట్లు జాషువా చెప్పారు. డబ్బులిచ్చినట్లు ఎవరికైనా చెబితే క్రిమినల్ కేసులు పెట్టి, వ్యాపారం మూయించేస్తామని బెదిరించారని యజమానులు చెప్పారు' అని ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

# దక్షిణాదికి తీవ్ర నష్టం

''లోక్‌సభలో సీట్ల సంఖ్యను జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే అది దక్షిణాదికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. మేం దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోం. ఎందుకంటే అది దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపు అవుతుంది''

**పునర్విభజన చేసే పక్షంలో లోక్‌సభలో పెరగనున్న సీట్లలో మా రాష్ట్రాలకు 33% ఇవ్వండి**
**సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ**



**సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్**

**ఈ-కబురు, హైదరాబాద్:** ''లోక్‌సభలో సీట్ల సంఖ్యను జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే అది దక్షిణాదికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. మేం దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోం. ఎందుకంటే అది దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపు అవుతుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంచేశారు. ''ఒకవేళ కేంద్రంలోని భాజపా పునర్విభజన ప్రక్రియను తప్పనిసరిగా చేయాలనుకుంటే లోక్‌సభలో పెరగనున్న సీట్లలో దక్షిణాది రాష్ట్రాలకు 33% సీట్లు ఇవ్వాలనేది మా ప్రధాన డిమాండ్. ప్రస్తుతం 543 సీట్లున్న లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 130. ఇది మొత్తం సీట్లలో 24%. పునర్విభజనతో 50% సీట్లను పెంచాలనుకుంటే 272 సీట్లు అదనంగా పెరుగుతాయి. అప్పుడు మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్య 815 అవుతుంది. అందులో దక్షిణాదికి 33% అంటే 272 సీట్లు ఇవ్వాలి. లేదంటే వచ్చే పాతికేళ్ల పాటు లోక్‌సభ సీట్ల సంఖ్యలో మార్పు చేయవద్దు'' అని ఆయన సూచించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో శనివారం నిర్వహించిన 'న్యాయమైన పునర్విభజన'(ఫెయిర్ డీలిమిటేషన్) సంయుక్త కార్యాచరణ కమిటీ తొలి సమావేశంలో రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

ఆయన ఏమన్నారంటే... ''జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలి. దేశ నిర్మాణంలో 1975 నుంచి 2025 వరకు అందించిన సేవలకు మనల్ని అభినందించాలి. మనకు వెనక్కి కొంత చెల్లించాలి. జనాభా దామాషా ప్రాతిపదికన చేసే పునర్విభజన చేపట్టొద్దని దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. దేశంలోని ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణాదికి అవకాశమివ్వాలి. మంచి ప్రగతి సాధించిన దక్షిణాదికి పార్లమెంటు సీట్లలో మంచి వాటా ఇవ్వడం ద్వారా ఇతర రాష్ట్రాలు ఆర్థికవృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించేలా చేయాలి. ఈ సీట్లను దక్షిణాదిలోని

**ఇదీ నా మొదటి సూచన... అసలు సీట్లను పెంచొద్దు. ఉన్న సీట్లతోనే పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. 1976లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అలానే పునర్విభజన చేపట్టింది. లేకుంటే రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానతలు వచ్చేవి. 2001లో వాజ్‌పేయీ నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అలానే ప్రారంభించింది. ప్రస్తుతం ప్రధాని మోదీ ఈ విధానాన్ని అమలు చేస్తారా?**

తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలకు ఇప్పుడున్న నిష్పత్తి ప్రాతిపదికన పంచవచ్చు.
దేశంలో మిగిలిన సీట్లను ఉత్తరాది, ఇతర రాష్ట్రాలకు కేంద్రం తమ అభిమతం మేరకు పంచవచ్చు. అనుకున్న దానికంటే దక్షిణాదికి సీట్ల సంఖ్య తగ్గిస్తే అది దేశ రాజకీయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు సైతం రాజకీయ విభేదాలను విస్మరించి పునర్విభజనలో మన వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని విన్నవిస్తున్నా. పునర్విభజన ప్రక్రియపై తెలంగాణ శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తాం. మీ రాష్ట్రాల్లోనూ అలానే చేయాలని సహచర ముఖ్యమంత్రులు, నాయకులను కోరుతున్నా. దక్షిణ భారతదేశ పౌరుల గళాన్ని బలంగా దేశం మొత్తానికి వినిపిద్దాం. పునర్విభజన ప్రక్రియపై రెండో సమావేశాన్ని వచ్చే నెలలో హైదరాబాద్‌లో నిర్వహిస్తాను. ఈ పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు భారీ బహిరంగ సభను ఏర్పాటుచేస్తా. దక్షిణ భారత సోదర, సోదరీమణులంతా తరలివచ్చి... మన హక్కుల రక్షణకు కలిసి రావాలని విన్నవిస్తున్నా.

**భాజపాది జనాభా జరిమానాల విధానం**
జనాభా నియంత్రణపై 1971లో దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని విజయవంతంగా అమలు చేస్తే... ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు విఫలమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి. దేశ ఖజానాకు భారీగా నిధులు సమకూరుస్తున్న ఈ రాష్ట్రాలకు తిరిగి.. తక్కువ మొత్తమే దక్కుతోంది. కర్ణాటక పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే కేవలం 14 పైసలు, తమిళనాడుకు 29 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు వెనక్కి వస్తున్నాయి. అదేసమయంలో బిహార్‌కు రూ.6.06, ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.2.73, మధ్యప్రదేశ్‌కు రూ.1.73 వెనక్కి వెళుతున్నాయి. మరోవైపు దక్షిణాదికి కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులను తగ్గిస్తోంది. మనది ఒకే దేశం... మనం దాన్ని గౌరవిస్తాం. పునర్విభజనను మాత్రం అంగీకరించబోం.ఈ అసమగ్రమైన ప్రక్రియను చేపట్టకుండా మనం భాజపాను అడ్డుకోవాల్సిందే.

నా రెండో సూచన... భాజపా ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజన చేపడితే మనల్ని ఉత్తరాది వారు ద్వితీయ శ్రేణి పౌరుల స్థాయికి తగ్గిస్తారు.

**నష్టపోయే రాష్ట్రాల ఎంపీలతో కమిటీ**

పునర్విభజనతో నష్టపోయే ఇతర రాష్ట్రాల గళాన్ని సైతం బలంగా వినిపించేందుకు వాటిల్లోని అన్ని పార్టీల ఎంపీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. దేశ రాజధాని దిల్లీలోనే రాజకీయపరమైన అన్ని నిర్ణయాలు జరుగుతాయని, ఈ నేపథ్యంలో అక్కడ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ... పరస్పరం సమన్వయం చేసుకుంటూ... భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఎంపీలతో కూడిన కమిటీ పని చేయాలని, ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఇందుకు సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రులు, నాయకులు అంగీకరించడంతో ఢిల్లీలో ఆ కార్యాలయం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

జనాభా ప్రాతిపదికన పునర్విభజనతో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చెలాయిస్తాయని ఇక్కడున్న ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. మనం దీనికి అంగీకరించకూడదు.

నా మూడో సూచన... నిష్పత్తి(ప్రొరేటా) విధానాన్ని సైతం అంగీకరించలేం. దీనితోనూ దక్షిణాదికి నష్టమే కలుగుతుంది. ఈ పద్ధతిని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది. ఒక్క సీటు కూడా భారీ తేడాను చూపుతుంది. ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మనదేశంలో ఉంది. అందుకే వాజ్‌పేయీ పాటించిన విధానాన్నే ప్రధాని మోదీ అనుసరించాలి'' అని రేవంత్ పేర్కొన్నారు.

''సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్లలో ఎటువంటి మార్పు తీసుకురావద్దు. పునర్విభజనకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకోవాలి. తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ సీట్ల సంఖ్య పెంచాలి. ప్రతి రాష్ట్రంలో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించాలి. నేను తెలంగాణలోని మల్కాజిగిరి ఎంపీగా చేశా. అది దేశంలోనే అతి పెద్ద లోక్‌సభ నియోజకవర్గం. అక్కడి జనాభా 45 లక్షలైతే ఓటర్లు 32 లక్షలు. అందువల్ల నేను ఈ సమస్యను పూర్తిగా అర్థం చేసుకోగలను'' అని రేవంత్ తెలిపారు.

# మావోయిస్టుల ఏరివేత వేళ.. పెరిగిన మందుపాతరల ముప్పు!

**యాంటీ నక్సల్స్ ఆపరేషన్ల వేళ భద్రతాబలగాలకు మందుపాతర(ఐఈడీ)లు సవాల్‌గా మారుతున్నాయి.**

**ఈ-కబురు** : మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతాబలగాలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చికల్లా నక్సల్స్ రహిత దేశంగా మార్చుతామన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో తమ ఆపరేషన్‌లను తీవ్రతరం చేశాయి. గత మూడు నెలల వ్యవధిలోనే దాదాపు 120 మంది మావోయిస్టులు మృతి చెందారు. అయితే, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ల వేళ రక్షణ దళాలకు మందుపాతర(ఐఈడీ)లు సవాల్‌గా మారుతున్నాయి. ఇటీవల కాలంలో ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లలో ఐఈడీ పేలుళ్లు, స్వాధీనం ఘటనలు పెరిగాయి. మరోవైపు సిగ్నల్స్ ద్వారా దూరం నుంచి పేల్చగల ఆర్‌సీఐఈడీ (రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీ)లూ లభ్యమవుతుండటం కలవరం రేపుతోంది.

**భారత అంతర్జాతీయ సరిహద్దులపై ఏఐ ఆధారిత రోబోల నిఘా..!**
అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతరలకు సంబంధించి 78 పేలుళ్లు, స్వాధీనం ఘటనలు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో మార్చి మధ్య నాటికే ఈ సంఖ్య 100 దాటింది. 202022లో సెక్యూరిటీ క్యాంపులకు 37 కిలోమీటర్ల పరిధిలో ఐఈడీలు లభ్యమయ్యేవని, 202324 మధ్యకాలంలో అవి మూడు కిలోమీటర్లలోపే వెలుగుచూస్తున్నట్లు ఓ నివేదికలో వెల్లడైంది. 202021తో పోలిస్తే 202224లో ఈ తరహా ఘటనలు 25 శాతం పెరిగాయని తేలింది. గత ఏడాది కాలంలో ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 70కుపైగా కొత్త ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్‌వోబీ)లు ఏర్పాటయ్యాయి. వీటి సంఖ్య పెరిగిన కొద్దీ ఐఈడీ ఘటనలూ పెరుగుతున్నట్లు ఓ అధికారి వెల్లడించారు.



**ఆర్‌సీఐఈడీల ముప్పు..!**
ఇటీవల కాలంలో 'ఆర్‌సీఐఈడీ'ల ముప్పు ఆందోళనకరంగా మారింది. గతవారం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లాలో సీఆర్పీఎఫ్ క్యాంప్ సమీపంలో 5 కిలోల పేలుడు పదార్థం వెలుగుచూడటం కలకలం రేపింది. బాంబు వద్ద రెండు ఖాళీ గాజు సీసాలతోపాటు దూరం నుంచి పేల్చేందుకు వీలుగా సమీపంలోని ఓ చెట్టు కింద వైర్‌తో అనుసంధానమై ఉన్న చిన్న యాంటెన్నా కూడా లభ్యమైంది. ఈ ఏడాది జనవరిలో బీజాపుర్ జిల్లాలోనే ఓ వంతెన కింద తొలిసారి ఈ తరహా ఐఈడీని సీఆర్పీఎఫ్ స్వాధీనం చేసుకుంది. ఆర్‌సీఐఈడీల వాడకం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. సాధారణ మందుపాతరలతో పోలిస్తే.. దూరం నుంచి వీటిని పేల్చే వీలుండటంతో మరింత ప్రమాదకరమని హెచ్చరించారు.

**రక్షణ దళాలకు "హై అలర్ట్"**
మావోయిస్టుల టీసీవోసీ (టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్) సమీపిస్తున్న నేపథ్యంలో.. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లలో ఐఈడీ దాడుల విషయంలో రక్షణ దళాలకు ''హై అలర్ట్'' జారీ చేసినట్లు ఓ అధికారి తెలిపారు. వేసవిలో అడవి పరిస్థితులను అనుకూలంగా మలచుకుని భద్రతాదళాలపై దాడులు చేసేందుకు మావోయిస్టులు టీసీవోసీ చేపడతారు. ''మావోయిస్టులను నిర్మూలించాలన్న టార్గెట్‌కు అనుగుణంగా బలగాలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా బస్తర్‌లోని మారుమూల ప్రాంతాలకూ చొచ్చుకెళ్తున్నాయి. కొత్త క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాయి. మరోవైపు.. ఆయుధాల కొరతతో మావోయిస్టులు ప్రత్యక్ష దాడులకు వెనుకంజ వేస్తున్నారు. బలగాలకు భారీ నష్టం చేకూర్చే లక్ష్యంతో మందుపాతరల మార్గాన్ని ఎంచుకుంటున్నారు'' అని ఓ అధికారి తెలిపారు.




## టాటా కార్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా 'ఛావా' హీరో

**న్యూఢిల్లీ:** బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ వెల్లడించింది. తమ ప్యాసింజర్, ఎలక్ట్రిక్ వాహనాల శ్రేణి ప్రచారానికి ఆయన తోడ్పడనున్నట్లు తెలిపింది.ఐపీఎల్ సీజన్ సందర్భంగా కొత్త టాటా కర్వ్ ప్రచార కార్యక్రమంతో ఈ భాగస్వామ్యం ప్రారంభమవుతుందని వివరించింది. ఇందుకోసం 20 సెకన్ల నిడివితో 'టేక్ ది కర్వ్' పేరిట ప్రకటనలు రూపొందించినట్లు సంస్థ పేర్కొంది.ఈ నేపథ్యంలో టాటా మోటర్స్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఒక రీల్‌ను కూడా పోస్ట్ చేసింది. ఇందులో కౌశల్ కంపెనీ తాజా కారు కర్వ్‌ను ప్రమోట్ చేస్తూ కనిపించాడు. ఈ పోస్ట్ లో "ఉత్తమ కథలు ట్విస్ట్ లతో నిండి ఉంటాయి.. విక్కీ కౌశల్‌తో టాటా మోటార్స్ కొత్త శకానికి స్వాగతం'' అంటూ రాసుకొచ్చింది.

## ఫోర్త్ సిటీ.. దక్షిణ హైదరాబాద్‌కి రియల్ బూమ్!




**నీరు ఎత్తు నుంచి పల్లం వైపునకు పారినట్లే.. రియల్ ఎస్టేట్ అవకాశాలు, అభివృద్ధి కూడా మౌలిక వసతులు మెరుగ్గా ఉన్న ప్రాంతం వైపే విస్తరిన్నాయి. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్‌స్‌తో మొదలైన స్థిరాస్తి అభివృద్ధి ఐటీ హబ్ రాకతో గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ ప్రాంతాల వైపు పరుగులు పెట్టింది. కొత్త ప్రాంతంలో అభివృద్ధి విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ హైదరాబాద్ వైపు దృష్టిసారించింది. విద్య, వైద్యంతో పాటు ఏఐ సిటీ, ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లతో కూడిన నాల్గో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనుంది. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో నిర్మితం కానున్న ఈ కొత్త నగరంతో స్థిరాస్తి అవకాశాలు పశ్చిమం నుంచి దక్షిణ హైదరాబాద్ వైపు మళ్లనుంది.**

మన దేశంలో నోయిడా, గ్రేటర్ నోయిడా, దక్షిణ కొరియాలో ఇంచియాన్ ఫ్రీ ఎకనామిక్ జోన్ సక్సెస్‌లను స్ఫూర్తిగా తీసుకొని.. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. నగరం సమీపంలోని మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, ముచ్చర్ల గ్రామాల పరిధుల్లో 814 చదరపు కిలో మీటర్లు, 2,01,318 ఎకరాల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీ విస్తరించి ఉంటుంది. కడ్తాల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మహేశ్వరం, మంచాల్, యాచారం, ఆమన్‌గల్ 7 మండలాల్లోని 56 గ్రామాలు ఫోర్త్ సిటీ పరిధిలోకి వస్తాయి.

ఈ నగరం సాకారమైతే 30-35 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 60-70 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఈ విస్తరణ ప్రణాళిక హైదరాబాద్ రియల్ రంగానికి ఊతంగా నిలవనుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేలలో స్థిరాస్తి పెట్టుబడి అవకాశాలు మరింత మెరుగవుతాయి. నివాస, వాణిజ్య, పారిశ్రామిక స్థలాలకు డిమాండ్ ఏర్పడనుంది. ప్రాపర్టీ విలువలు గణనీయంగా పెరుగుతాయి. నెట్ జీరో సిటీగా నిర్మితం కానున్న ఈ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పర్యవేక్షణ నిమిత్తం ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది.

**ఫ్యూచర్ సిటీ స్వరూపమిదీ**

ఎలక్ట్రానిక్స్ అండ్ సాధారణ పరిశ్రమలు: 4,774 ఎకరాలు
లైఫ్ సైన్స్ హబ్: 4,207 ఎకరాలు
నివాస, మిశ్రమ భవనాలు: 1,317 ఎకరాలు
నివాస భవనాల జోన్: 1,013 ఎకరాలు
స్పోర్ట్స్ హబ్: 761 ఎకరాలు
ఎడ్యుకేషనల్ అండ్ వర్సిటీ జోన్: 454 ఎకరాలు
ఎంటర్‌టైన్‌మెంట్: 470 ఎకరాలు
హెల్త్ సిటీ: 370 ఎకరాలు
ఫర్నీచర్ పార్క్: 309 ఎకరాలు
ఏఐ సిటీ: 297 ఎకరాలు

**నెట్‌జీరో సిటీగా..**

చుట్టూ పచ్చదనం, విశాలమైన రహదారులు, ప్రణాళికబద్ధంగా నివాస ప్రాంతాలు, వాణిజ్య క్లస్టర్లు, ఐటీ కంపెనీలు, బహుళ జాతి సంస్థలు ఒక చోట వీటన్నింటికీ దూరంగా పరిశ్రమలు, ఇలా పర్యావరణహితంగా కాలుష్యరహితంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నారు. నెట్ జీరో సిటీగా ఏర్పాటుకానున్న ఈ నగరానికి సంబంధించి ప్రభుత్వం వేర్వేరు ప్రణాళికలను తయారు చేసింది. వచ్చే యాభైఏళ్లలో అక్కడ మారనున్న పరిస్థితులను అనువుగా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించారు.

**వ్యర్థాల నిర్వహణ..**

పర్యావరణాన్ని కాపాడేందుకు నెట్ జీరో సిటీలో 33 శాతం గ్రీనరీ ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. చెట్లు, వాణిజ్య పంటలు, రహదారుల వెంట నీడనిచ్చే వృక్షాలు ఉంటాయి. వీటి ద్వారా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కంటే ఇక్కడ 2-3 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఇళ్లు, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలు, ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేకమైన వ్యవస్థను రూపకల్పన చేస్తున్నారు. వ్యర్థ జలాలను శుద్ధీకరించి మళ్లీ వినియోగించేందుకు వీలుగా మారుస్తారు. దీంతో పాటు పరిశ్రమలు, ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాల నిర్వహణకు ఇంధనం, విద్యుత్ వినియోగాన్ని తగ్గించి సౌర విద్యుత్ వాడేలా చూస్తారు. పరిశ్రమలు, ఐటీ సంస్థలు, నివాసాలు నిర్మించేటప్పుడు జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కాలుష్యరహిత వస్తువులను వినియోగించేలా చూస్తారు.

**ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్స్‌కు ప్రాధాన్యం..**

ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ రెండు రంగాలకే ఏకంగా 64 శాతం భూమిని కేటాయించారు. ఎలక్ట్రానిక్స్, సాధారణ పరిశ్రమలకు 4,774 ఎకరాలు, లైఫ్‌సైన్స్ హబ్‌కు 4,207 ఎకరాలను కేటాయించారు. కొంగరకలాన్‌లో యాపిల్ ఫోన్ విడిభాగాలను తయారు చేస్తున్న ఫాక్స్‌కాన్ సంస్థ ఎలక్ట్రానిక్స్ జోన్‌లో తన శాఖలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. లైఫ్‌సైన్ జోన్‌లో ప్రాణాధార మందుల తయారీ, పరిశోధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించనుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ప్రముఖ ఫార్మా సంస్థలు వాటి విస్తరణ ప్రాజెక్ట్‌లను ఇక్కడ ప్రారంభించేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.

**రోడ్డు, రైలు, విమానం.. అన్నీ..**

- ఫ్యూచర్ సిటీకి రోడ్డు, రైలు, విమాన మార్గాలతో అనుసంధానించేలా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను కల్పించనున్నారు.
- ఫ్యూచర్ సిటీకి హైదరాబాద్ నుంచి సులభంగా చేరుకునేందుకు విమానాశ్రయం నుంచి ఔటర్ రింగ్ రోడ్‌కు, అలాగే ఔటర్ నుంచి ప్రతిపాదిత ప్రాంతాలు బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల వరకూ 330 అడుగుల వెడల్పు రహదారులు, ఇతర అంతర్గత రహదారులను నిర్మించనున్నారు.
- రావిర్యాల ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ముచ్చర్ల, ఆమన్‌గల్ మండలంలోని ఆకుతోటపల్లె వద్ద రీజినల్ రింగ్ రోడ్‌ను కలుపుతూ 40 కిలోమీటర్ల రహదారిని నిర్మించనున్నారు.
- దీంతో పాటు రాజేంద్రనగర్‌లో రానున్న కొత్త హైకోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు మార్గాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

# జీసీసీల్లో 10% వేతనాల వృద్ధి ..

# వచ్చే 12 నెలల్లో అంచనా

**2030 నాటికి 110 బిలియన్ డాలర్లకు దేశీ జీసీసీ మార్కెట్**

**ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ నివేదిక**




**న్యూఢిల్లీ:** ప్రతిభావంతులైన ఉద్యోగులు వెళ్లిపోకుండా అట్టే పెట్టుకోవడం, స్థూల ఆర్థిక సమస్యలను అధిగమించడం తదితర సవాళ్ల నేపథ్యంలో దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) మెరుగైన వేతన పెంపుపై దృష్టి పెడుతున్నాయి. దీంతో వచ్చే 12 నెలల్లో వేతన వృద్ధి సుమారు 9.8 శాతం వేతన వృద్ధి ఉంటుందని అంచనాలు నెలకొన్నాయి. డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ రూపొందించిన 'ఇండియా టాలెంట్ టేకాఫ్ - ది జీసీసీ 4.0 స్టోరీ' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.

'ప్రపంచ జీసీసీల్లో దాదాపు 55 శాతం సెంటర్లు భారత్‌లో ఉన్నాయి. 2030 నాటికి ఈ మార్కెట్ పరిమాణం 110 బిలియన్ డాలర్లకు చేరనుంది. వ్యయాలు తగ్గించుకోవడం, పరిస్థితులను బట్టి వేగంగా స్పందించే సామర్థ్యాలను పెంచుకోవడం, విస్తృతంగా ప్రతిభావంతులను అందుబాటులో ఉంచుకోవడం వంటి అంశాలపై కంపెనీలు దృష్టి పెడుతుండటం ఇందుకు దోహదపడుంది. ఈ పరిణామంతో వేతనాలు కూడా గణనీయంగా పెరగనుండటమనేది ఉద్యోగులకు కూడా కలిసి రానుంది.

ముఖ్యంగా స్పెషలైజ్డ్ నైపుణ్యాలు ఉన్నవారికి గతంలో ఎన్నడూ లేనంత డిమాండ్ నెలకొంది' అని ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ సీఈవో సచిన్ అలగ్ చెప్పారు. 'ఆర్థిక సేవల విభాగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిస్క్ అనలిస్టులు, కాంప్లయెన్స్ అసోసియేట్స్, సీనియర్ రిస్క్ మేనేజర్లు, ఎఫ్‌ఆర్‌ఎం లీడ్స్, కాంప్లయెన్స్ హెడ్స్, గ్లోబల్ ఫైనాన్స్ డైరెక్టర్స్ మొదలైన హోదాల్లో ఉన్నవారికి వార్షికంగా రూ. 6 లక్షల నుంచి రూ. 90 లక్షల శ్రేణిలో వేతనాలు ఉంటున్నాయి.

సాంప్రదాయ హోదాలతో పోలిస్తే రిస్క్, ఎఫ్‌ఆర్‌ఎం వంటి స్పెషలైజ్డ్ నైపుణ్యాలున్న వారికి వేతనాలు 25-40 శాతం అధికంగా ఉంటున్నాయి. అలాగే, మౌలిక రంగాల పరిధిని దాటి ఆర్థిక విభాగంలో నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో కొత్త అవకాశాలు వస్తున్నాయి' అని అలగ్ వివరించారు.

**అసమానతలపై దృష్టి పెట్టాలి..**

వేతన వృద్ధి పటిష్టంగానే ఉన్నప్పటికీ స్త్రీ, పురుష ఉద్యోగుల జీతభత్యాల మధ్య అసమానతలను తగ్గించేందుకు మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అలగ్ చెప్పారు. పురుష ఉద్యోగుల జీతభత్యాలతో పోలిస్తే మహిళా ఉద్యోగుల వేతనాలు సగటున 75-85 శాతం స్థాయిలోనే ఉంటున్నాయని చెప్పారు. ఇక సీనియర్ హోదాల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉందని, లీడర్‌ప్ బాధ్యతల్లో మహిళల ప్రాతినిధ్యం పరిమిత స్థాయిలోనే ఉంటోందని పేర్కొన్నారు. ఆరు నగరాలవ్యాప్తంగా 10 వివిధ రంగాలకు చెందిన 207 జీసీసీల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది.

**నివేదికలోని మరిన్ని వివరాలు..**

- మిగతా సంస్థలతో పోలిస్తే హైదరాబాద్ (19 శాతం), ముంబై (19 శాతం) ల్లోని జీసీసీలు అత్యధికంగా చెల్లిస్తున్నాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ సాఫ్ట్‌వేర్ .. కన్సల్టింగ్ (22 శాతం), బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసుల (18 శాతం) విభాగాలు ఉన్నాయి.
- జూనియర్, మధ్య స్థాయి ఉద్యోగాల్లో వేతన వృద్ధి పటిష్టంగా ఉండనుంది. ఏఐ, ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్‌సెక్యూరిటీ వంటి విభాగాల్లో నిపుణులకు భారీ డిమాండ్ నెలకొనడం ఇందుకు కారణం. మరోవైపు, పైస్థాయి ఉద్యోగాల్లో వ్యయాలను నియంత్రించుకోవడానికి కంపెనీలు ప్రాధాన్యతనిస్తుండటంతో సీనియర్ హోదాల్లోని వారికి వేతనాల పెంపు ఒక మోస్తరుగానే ఉండనుంది.
- రాబోయే రోజుల్లో, 2030 నాటికి దేశీయంగా జీసీసీ రంగం వార్షికంగా 9-12 శాతం వృద్ధి చెందనుంది. దానికి తగ్గట్లుగా వేతనాలు కూడా భారీగా పెరగనున్నాయి.




## సెబీ కొత్త రూల్స్ ఏప్రిల్ 1 నుంచే..

**సొంత పథకాల్లో పెట్టుబడుల పరిమితి తగ్గింపు**

**నిబంధనల వెసులుబాటు కల్పించిన సెబీ**

**న్యూఢిల్లీ:** అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల్లో (ఏఎంసీలు/మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థలు) పనిచేసే ఉద్యోగులకు సెబీ నిబంధనల పరంగా ఊరట కల్పించింది. ముఖ్య నిర్వహణ అధికారి (సీఈవో), ముఖ్య పెట్టుబడుల అధికారి (సీఐవో), ఫండ్ మేనేజర్లు తదితర ఎంపిక చేసిన కీలక ఉద్యోగులు తమ వార్షిక వేతనంలో 20 శాతం మేర తమ సంస్థ నిర్వహిస్తున్న మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోనే ఇన్వెస్ట్ చేయాలని ప్రస్తుత నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. అంతేకాదు ఇలా చేసిన పెట్టుబడులకు మూడేళ్ల పాటు లాకిన్ ఉంటుంది. దీన్నే 'స్కిన్ ఇన్ ద గేమ్'గా చెబుతారు. ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనల అమలులో కొంత ఉపశమనాన్ని సెబీ కల్పించింది. స్థూల వార్షిక పారితోషికం ఆధారంగా మ్యూచువల్ ఫండ్స్ సంస్థల ఉద్యోగులు సొంత నిర్వహణ పథకాల్లో చేయాల్సిన పెట్టుబడుల శాతంలో మార్పులు చేసింది. మ్యూచువల్ ఫండ్స్ ఉద్యోగుల నైతిక నడవడిక, సొంత పథకాల నిర్వహణలో బాధ్యతను పెంచడం, ఇన్వెస్టర్ల ప్రయోజనాల పరిరక్షణ ఇందులోని ఉద్దేశ్యాలుగా ఉన్నాయి.

**కొత్త నిబంధనలు..**

- కొత్త నిబంధనల కింద రూ.25 లక్షలకు మించని వేతనం ఉన్న వారు సొంత మ్యూచువల్ ఫండ్స్ సంస్థ పథకాల్లో ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం లేదు.
- రూ.25 లక్షలకు మించి ఆదాయం ఉన్న వారు 10 శాతం ఇన్వెస్ట్ చేయాలి. ఇసాప్‌లు/ఉద్యోగ స్టాక్ ఆప్షన్లు కూడా కలుపుకుంటే 12.5% పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.
- రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య వేతనం ఉన్న వారు కనీసం 14 శాతం మేర (ఒకవేళ స్టాక్ ఆప్షన్లు కూడా ఉంటే 17.5 శాతం) పెట్టుబడులు పెట్టాలి.

## బెల్జియంకు పారిపోయిన వజ్రాల వ్యాపారి స్వదేశానికి రప్పించే యత్నంలో భారత్



**పంజాబ్ నేషనల్ బ్యాంకును సుమారు రూ. 13వేల కోట్లు మోసం చేసి భారతదేశాన్ని విడిచిపెట్టి బెల్జియం పారిపోయిన వజ్రాల వ్యాపారి 'మెహుల్ చోక్సీ'ను రప్పించడానికి భారత ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగానే ప్రభుత్వం.. బెల్జియంలోని సంబంధిత అధికారులను సంప్రదించింది.**

వేలకోట్లు మోసం చేసి.. ఆంటిగ్వాబార్బుడా పౌరసత్వం తీసుకున్న మెహుల్ చోక్సీ.. ఈ మధ్య కాలంలోనే బెల్జియం వెళ్ళాడు. తన భార్య ప్రీతి బెల్జియన్ పౌరురాలు అని తెలుస్తోంది. దీంతో చోక్సీ కూడా అక్కడ రెసిడెన్సీ కార్డ్ పొందాడు. బెల్జియన్ నివాసం కోసం తప్పుడు పత్రాలు ఉపయోగించారని చోక్సీపై ఆరోపణలు ఉన్నాయి.

నిజానికి పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చిన తరువాత.. చోక్సి, నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వాబార్బుడాకు పారిపోగా.. నీరవ్ మోదీ బ్రిటన్ జైలులో ఉన్నాడు. వీరిని భారత్‌కు రప్పించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

ఇటీవల భారత్ పర్యటనకు వచ్చిన ఆంటిగ్వాబార్బుడా విదేశాంగ మంత్రి ఈపీ ఛెత్ గ్రీన్ మాట్లాడుతూ.. మెహుల్ ఛోక్సీ ప్రస్తుతం తమ దేశంలో లేరని, వైద్యం కోసం విదేశాలకు వెళ్లినట్లు తెలిసిందని వెల్లడించారు. ప్రస్తుతం చోక్సి విదేశాల్లో ఉన్నప్పటికీ.. భారతదేశ పౌరసత్వాన్ని వదులుకోలేదు.

ఇక లండన్ జైలులో ఉన్న నీరవ్ మోదీకి బెయిల్ ఇవ్వడంపై కోర్టులు పదే పదే నిరాకరించడంతో.. తనను భారతదేశానికి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నాడు. మెహుల్ ఛోక్సీని బెల్జియం అధికారులు.. భారత ప్రభుత్వానికి అప్పగిస్తారా?.. లేదా?, అనే విషయాలు తెలియాల్సి ఉంది.

## జియోహాట్‌స్టార్‌కు యాడ్స్ ద్వారా వచ్చే ఆదాయం ఎన్ని కోట్లంటే?

**క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025' మొదలైపోయింది. సుమారు రెండు నెలల పాటు సాగే ఈ సీజన్‌కు సంబంధించిన డిజిటల్, ఓటీటీ రైట్స్ అన్నింటినీ జియోహాట్‌స్టార్ సొంతం చేసుకుంది. ఈసారి జియోహాట్‌స్టార్ ప్రకటనల ద్వారానే ఏకంగా రూ. 4,500 కోట్లు సంపాదించనుంది. దీనికోసం సంస్థ.. 32 కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.**




**ఐపీఎల్ 2025 ప్రకటన ధరలు**

- **టీవీ ప్రకటనలు:** రూ.40 కోట్ల నుంచి రూ.240 కోట్లు
- **ప్రాంతీయ టీవీ ప్రకటనలు:** రూ.16 కోట్ల నుంచి ప్రారంభమవుతాయి
- **కనెక్టెడ్ టీవీ (CTV):** 10 సెకన్లకు రూ.8.5 లక్షలు
- **మొబైల్ ప్రకటనలు:** రూ.250 వరకు స్పాన్సర్లు

జియోహాట్‌స్టార్ స్పాన్సర్ల జాబితాలో.. మై11సర్కిల్, ఫోన్‌పే, ఎస్బీఐ, బ్రిటానియా 5050, అమెజాన్ ప్రైమ్, డ్రీమ్11, టీవీఎస్, మారుతి, అమెజాన్ ప్రైమ్, వోల్టాస్, ఎంఆర్ఎఫ్, జాగ్వార్, ఏషియన్ పెయింట్స్, అమూల్ మొదలైన 32 కంపెనీలు ఉన్నాయి. ఇవన్నీ టీవీ, డిజిటల్ స్ట్రీమింగ్‌లో యాడ్స్ కోసం ఇప్పటికే డీల్స్ కుదుర్చుకున్నాయి.

**జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్స్**

ఐపీఎల్ 2025 సమయంలో.. జియోహాట్‌స్టార్ 40 మిలియన్ల అదనపు చెల్లింపు సబ్‌స్కైబర్‌ల ప్రత్యేక ఆఫర్స్ అందించడం మొదలుపెట్టింది. డీస్నీ ప్లస్ హాట్‌స్టార్, జియో సినిమా విలీనం తర్వాత ఏర్పడిన స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్.. ప్రస్తుతం 62 మిలియన్ల సబ్‌స్కైబర్‌లను కలిగి ఉంది. 2025 ఫిబ్రవరి 14న ఈ సంఖ్య 50 మిలియన్లు. ఈ ఐపీఎల్ 2025 సీజన్‌కు 100 మిలియన్ల సబ్‌స్కైబర్‌లను చేరుకోవడానికి సంస్థ కృషి చేస్తోంది.

# ఆ రెండు మూవీస్ ఇక లేనట్టేనా?



పవన్ కల్యాణ్ తెలుగులో స్టార్ హీరో. కానీ ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. దీంతో చేతిలో ఉన్న సినిమాలే పూర్తి చేయలని పరిస్థితి. అలాంటి కొత్త చిత్రాలంటే అస్సలు అయ్యే పనికాదు. ఈ క్రమంలోనే కొత్త సినిమాలు రెండు క్యాన్సిల్ అయ్యాయనే మాట వినిపిస్తోంది.

పవన్ చేతిలో ప్రస్తుతం 'హరిహర వీరమల్లు', 'ఓజీ' సినిమాలున్నాయి. వీటిలో 'హరిహర..' లెక్క ప్రకారం ఈ మార్చి 27న రిలీజ్ కావాలి. కానీ మే 9కి వాయిదా వేశారు. పవన్ కి సంబంధించిన కొన్ని సీన్స్ పెండింగ్ ఉన్నాయని అంటున్నారు. మరి మేలో అయినా సరే సినిమా రిలీజ్ చేస్తారా అనేది చూడాలి.

పవన్ ఫ్యాన్స్ చాలా ఆశలు పెట్టుకున్న 'ఓజీ'కి దాదాపు 20 రోజుల డేట్స్ పవన్ ఇవ్వాల్సి ఉందట. అది ఎప్పుడు జరిగితే దానిబట్టి రిలీజ్ చేసే ఆలోచనలో మూవీ టీమ్ ఉంది. ఈ రెండు సినిమాలు సెట్స్ పైకి వెళ్లి చాలా ఏళ్లు అయిపోయాయి. ఇదిగో అదిగో అంటున్నారు కానీ ఎప్పుడొస్తాయో చెప్పలేని పరిస్థితి.

ఇక 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ కొన్నిరోజులు చేశారు. గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. కానీ ఇప్పుడు ఈ మూవీని హోల్డ్ లో పెట్టేశారనే టాక్ ఉంది. అలానే సురేందర్ రెడ్డితో కమిట్ అయిన ప్రాజెక్ట్ కూడా క్యాన్సిల్ చేసేశారని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల బట్టి చూస్తే పవన్ చివరి చిత్రం 'ఓజీ'నే!

# 500 మంది డ్యాన్సర్లతో త్రిష మాస్ జాతర సాంగ్



కోలీవుడ్ నటుడు సూర్య, నటి త్రిష మాస్ జాతర సాంగ్‌తో తెరపై దుమ్ము రేపటానికి సిద్ధమవుతున్నారు. అంతేకాదు ఈ పాటలో 500 మంది డాన్సర్లు పాల్గొనబోతున్నారు. ఇది ఏ చిత్రం కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. సూర్య తన 45వ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ భారీ బడ్జెట్లో నిర్మిస్తోంది. నటుడు ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఇందులో ఆయన ప్రతి నాయకుడిగానూ నటిస్తున్నట్లు సమాచారం. కాగా నటి త్రిష నాయకిగా నటిస్తున్న ఇందులో నటి శ్వాసిక , ఇందిరస్, యోగిబాబు, షివాద, సుప్రీత్‌రెడ్డి, నట్టి నటరాజ్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. కాగా ఇందులో నటుడు సూర్య ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తెలిసింది. అందులో ఒకటి న్యాయవాది పాత్ర అని సమాచారం. అదేవిధంగా ఇది న్యాయస్థానంలో జరిగే కేసు నేపథ్యంగా సాగే వైవిద్య భరిత కథా చిత్రంగా ఉంటుందని తెలిసింది. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాదులో జరుగుతోంది. తదుపరి చెన్నైలోని ఈ సీ ఆర్‌రోడ్‌లో వేసిన భారీ సెట్ లో ఈ చిత్రానికి సంబంధించిన ఒక మాస్ జాతర పాటను చిత్రీకరించడానికి యూనిట్ సన్నద్ధం అవుతున్నట్లు తాజా సమాచారం. దీనికి సాయి అభయంకర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈయన ఫోక్ సంగీత బాణీలు కట్టిన ఈ మాస్ జాతర పాటలో సూర్య, త్రిషలతో పాటు 50 మంది డాన్సర్లు నటించబోతున్నట్లు తెలిసింది. దీనికి శోభి మాస్టర్ నృత్య దర్శకత్వం వహించనున్నారని యూనిట్ వర్గాలు పేర్కొన్నారు. ఈ ఒక్క పాట కోసమే కోట్లు ఖర్చు పెడుతున్నట్లు సమాచారం. నటుడు సూర్య నటించిన రెట్రో మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని పూర్తి చేసిన విషయం తెలిసిందే. నటి పూజా హెగ్డే కథానాయకిగా నటించిన ఈ చిత్రం మే 1న తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది.



# సల్మాన్ ఖాన్ యాక్షన్ థ్రిల్లర్.. ట్రైలర్ వచ్చేసింది




బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, పుష్ప బ్యూటీ రష్మిక మందన్నా జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ సికందర్. ఈ మూవీకి కోలీవుడ్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ , సల్మాన్ ఫిల్మ్ ఖాన్ ఫిల్మ్స్ ప్రొడక్షన్ బ్యానర్లపై సాజిద్ నదియావాలా నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఉగాది కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది.

ఈ నేపథ్యంలోనే మేకర్స్ సికందర్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ చూస్తుంటే ఫుల్ యాక్షన్ మూవీగానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ట్రైలర్‌లో సల్మాన్ ఖాన్ ఫైట్స్, డైలాగ్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ యాక్షన్ మూవీలో సత్యరాజ్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. కాగా.. ఈ చిత్రానికి ప్రీతమ్ సంగీతమందించారు.

# నో అప్డేట్స్.. అభిమానులకు నిరాశ తప్పదేమో!





ప్రస్తుతం రామ్ చరణ్, అల్లు అర్జున్ .. పాన్ ఇండియా హీరోలుగా ఫుల్ క్రేజ్ సంపాదించారు. చరణ్ ప్రస్తుతం ఓ మూవీ చేస్తున్నాడు. మరో మూవీ లైనులో ఉంది. బన్నీ కూడా రెండు సినిమాల కోసం సిద్ధమవుతున్నాడు. సరిగ్గా ఇలాంటి టైంలో ఓ బ్యాడ్ న్యూస్ అభిమానుల మధ్య చర్చకు కారణమవుతోంది.

హీరోలన్నాక సినిమాలు చేస్తుంటారు. మంచి రోజులు చూసుకుని అప్డేట్స్ ఇస్తుంటారు. ఇక పుట్టినరోజున గ్లింప్స్, పోస్టర్స్ లాంటివి రిలీజ్ చేస్తుంటారు. త్వరలో చరణ్ (మార్చి 27), బన్నీ (ఏప్రిల్ 8) బర్త్ డేలు రాబోతున్నాయి. దీంతో కొత్త మూవీ అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. కానీ ఈసారి అలాంటివేం ఉండవని తెలుస్తోంది.చరణ్‌బుచ్చిబాబు సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. కొన్నిరోజుల క్రితం ఈయన గుండెల్లో నొప్పి రావడంతో ఆస్పత్రిలో చేరారు. డిశ్చార్జ్ కూడా అయిపోయి ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే గ్లింప్స్ విజువల్స్ రెడీ అయిపోయినా సరే మ్యూజిక్ బాకీ ఉండటంతో చరణ్ పుట్టినరోజు దీన్ని రిలీజ్ చేయడం కష్టమేనని మాట్లాడుకుంటున్నారు.

మరోవైపు అల్లు అర్జున్ కొత్త మూవీస్ కి సంబంధించి పుట్టినరోజున అనౌన్స్ మెంట్స్ ఉండొచ్చని అనుకున్నారు. కానీ బన్నీ నానమ్మ ప్రస్తుతం వెంటిలేటర్ పై ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త సినిమాల ప్రకటన సరికాదని, వాయిదా వేసుకున్నట్లు సమాచారం. ఈ రూమర్స్ బట్టి చూస్తే త్వరలో మంచి రోజు చూసుకుని చరణ్, బన్నీ మూవీస్ అప్డేట్స్ రిలీజ్ చేస్తారనిపిస్తుంది.

# ఐదేళ్లుగా ఒంటరిపోరాటం అవమానాలు, నిందలు..

## మీరంతా క్షమాపణలు చెప్పాల్సిందే!



**బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మృతి కేసులో రియా చక్రవర్తికి ఎలాంటి సంబంధం లేదు. తను ఆత్మహత్యకు ప్రేరేపించలేదు అని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వెల్లడించింది. ఈ మేరకు కేసును క్లోజ్ చేసింది. దీంతో ఐదేళ్లుగా నిందలు మోస్తూ ఒంటరి పోరాటం చేస్తున్న రియా చక్రవర్తికి ఎట్టకేలకు ఉపశమనం లభించినట్లయింది.**

**సుశాంత్ మృతి.. మాజీ ప్రేయసిపై ట్రోలింగ్**

సుశాంత్ సింగ్ 2020లో జూన్ 14న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయన మృతి వెనక కుట్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. సుశాంత్ ప్రేయసి, నటి రియా చక్రవర్తి కూడా అందులో భాగమై ఉండొచ్చన్న ప్రచారం జరిగింది. దీంతో ఆమెపై తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ జరిగింది. తనను ఈసడించుకున్నారు. ఒక విలన్‌గా చూశారు. దీని పర్యవసానంగా సినిమా అవకాశాలకు ఫుల్‌స్టాప్ పడింది. అరెస్టు, జైలు జీవితం, విచారణతో రియా మానసికంగా కుంగిపోయింది.

**కేసులో నిర్దోషిగా తేలిన నటి**

తాను తప్పు చేయలేదన్న మాటను ఎవరూ లెక్క చేయలేదు. తప్పంతా నీదేనని నోరు నొక్కేశారు. ఎంతో భవిష్యత్తున్న హీరో ప్రాణాలు తీసుకోవడానికి కారణమయ్యావని అభాండాలు వేశారు. గుండె నిండా బాధను మోస్తూనే ఒంటరిగా పోరాడింది.. చివరకు కేసులో నిర్దోషిగా తేలింది. ఐదేళ్లుగా రియా అనుభవించిన బాధని, పోరాటాన్ని గుర్తు చేస్తూ నటి మంచు లక్ష్మి సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది.

**నిజం ఎంతోకాలం దాగదు**

రియా చక్రవర్తికి, ఆమె కుటుంబానికి క్లీన్ చిట్ వచ్చింది. ఇలాంటి రోజొకటి వస్తుందని నాకు తెలుసు. ఎందుకంటే నిజం ఎంతోకాలం దాగదు.. కాస్త ఆలస్యమైనా సరే బయటకు రాక తప్పదు. రియా, ఆమె కుటుంబం.. భరించలేని బాధను అనుభవించింది. సమాజం మిమ్మల్ని తప్పని నిందిస్తుంటే, మీతో రాక్షసంగా ప్రవర్తిస్తుంటే మీరు పోరాడిన విధానం ఆదర్శవంతం. మిమ్మల్ని అవమానించారు, చీల్చి చెండాడారు. అయినా ఎంతో హుందాగా నిలబడ్డారు.

**క్షమాపణలు చెప్పండి: మంచు లక్ష్మి**

నిజానిజాలు తెలుసుకోకుండా మీపై నోరు పారేసుకున్నవారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. క్షమాపణలు చెప్పాలి. అన్యాయంగా ఒక కుటుంబాన్ని ఎంత బాధపెట్టారో గుర్తు చేసుకుని పశ్చాత్తాపపడాలి. రియా.. నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది. నీకు మరింత శక్తి చేకూరాలి. ఇది ఒక ఆరంభం మాత్రమే.. ఇకపై అంతా మంచే జరుగుతుంది. నువ్వు అనుభవిస్తున్న బాధ ఇప్పటికైనా తగ్గుతుందని ఆశిస్తున్నాను అని రాసుకొచ్చింది. దీనికి అన్న హ్యాష్‌ట్యాగ్స్ ఇచ్చింది.

# శ్మశానంలో కూర్చున్నట్లుగా చూస్తున్నారు.. అదే జరిగుంటే చనిపోయేవాడిని

**ఎస్‌జే సూర్య మంచి నటుడు మాత్రమే కాదు దర్శకుడు కూడా! వాలి, ఖుషి(తమిళ, తెలుగు, హిందీ), నాని, అంబే ఆరుయిరే, పులి, ఇసై వంటి చిత్రాలకు దర్శకత్వం వహించాడు. ఖుషి తను డైరెక్ట్ చేసిన రెండో మూవీ. అయితే తొలిరోజు సరిగా రెస్పాన్స్ రాకపోవడం చూసి పిచ్చెక్కిందంటున్నాడు సూర్య. వీర ధీర శూరన్ సినిమా ప్రమోషన్స్‌లో ఎస్‌జే సూర్య మాట్లాడుతూ.. ఒక సినిమా డైరెక్ట్ చేయడమంటే.. ఓ మహిళ బిడ్డకు జన్మనివ్వడంతో సమానం. దర్శకత్వం అనేది చాలా కష్టం.**

**శ్మశానంలో కూర్చున్నట్లు..**



మనం ఏదైనా మనసుకు నచ్చినట్లు చేసుకుపోతుంటాం. కానీ డైరెక్షన్ చాలా ఒత్తిడితో కూడుకున్న పని. ఖుషి మూవీ ఇప్పుడు సూపర్ హిట్ అని అంటున్నారు. కానీ ప్రీమియర్ రోజు సినిమావాళ్లంతా ఏదో శ్మశానంలో కూర్చున్నట్లుగా సైలెంట్‌గా సినిమా చూస్తున్నారు. ఎవరి ముఖంలో చిన్న నవ్వు లేదు. నాకు భయమేసింది. అది మాత్రం ఫ్లాప్ అయిందంటే ఈరోజు నేనిక్కడ ఉండేవాడిని కాదు. నాకసలే కొంచెం పిచ్చి. నా సినిమా పోయిందంటే చనిపోయేందుకు కూడా వెనుకాడను.

**రెండో రోజు సీన్ మారింది.. లేదంటేనా..**

కానీ తర్వాతి రోజు నుంచి థియేటర్ శ్మశానంలా కాకుండా ఐపీఎల్ స్టేడియంలా మారిపోయింది. చప్పట్లు, విజిల్స్.. సంతోషమేసింది. సినిమా వైఫల్యాన్ని తట్టుకోవడం దర్శకుడికి చాలా కష్టం. సినిమా రిలీజ్‌కు ముందు కూడా ఇది బాగుందా? లేదా? అని డైలమాలో పడిపోతాడు. తనపై తాను నమ్మకాన్ని కోల్పోతాడు. డైరెక్షన్ చాలా టఫ్ అని చెప్పుకొచ్చాడు సూర్య. ఈయన డైరెక్షన్‌ను వదిలేసి పదేళ్లవుతోంది. నటుడిగా ఇటీవలే గేమ్ ఛేంజర్ సినిమాలో కనిపించాడు. ప్రస్తుతం ఈయన చేతిలో వీర ధీర శూరన్, ఇండియన్ 3, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ, సర్దార్ 2 చిత్రాలున్నాయి.




# అక్టోబర్‌లో విండీస్‌తో భారత్ టెస్టు సిరీస్

**పుష్కర కాలం తర్వాత భారత జట్టు సొంతగడ్డపై వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడబోతోంది. అక్టోబర్‌లో రెండు టెస్టుల పోరులో కరీబియన్ జట్టుతో రోహిత్ సేన తలపడనుంది.**

**డిసెంబర్ 6న విశాఖలో వన్డే**

**కోల్‌కతా:** పుష్కర కాలం తర్వాత భారత జట్టు సొంతగడ్డపై వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడబోతోంది. అక్టోబర్‌లో రెండు టెస్టుల పోరులో కరీబియన్ జట్టుతో రోహిత్ సేన తలపడనుంది. అక్టోబర్ 2న మొహాలీలో తొలి టెస్టు, 10న కోల్‌కతాలో రెండో టెస్టు ఆరంభమవుతాయి. 201314లో భారత్‌లో రెండు జట్ల మధ్య చివరిగా టెస్టు సిరీస్ జరిగింది. దిగ్గజ బ్యాటర్ సచిన్ తెందుల్కర్‌కి ఇదే ఆఖరి సిరీస్ కూడా. వెస్టిండీస్‌తో పోరు ముగిసిన వెంటనే మన దేశంలో దక్షిణాఫ్రికా రెండు టెస్టులతో పాటు మూడు వన్డేలు, అయిదు టీ20ల సిరీస్ ఆడుతుంది. దిల్లీ, గువాహటిల్లో టెస్టు మ్యాలు జరుగుతాయి. టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వడం గువాహటికి ఇదే తొలిసారి. వన్డే సిరీస్‌లో మూడో మ్యాచ్‌కు డిసెంబర్ 6న విశాఖపట్నం ఆతిథ్యమిస్తుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మహిళల వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తుందని.. త్వరలో తేదీలను ప్రకటిస్తామని బీసీసీఐ ఉపాధ్యక్షులు రాజీవ్ శుక్లా తెలిపారు. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌కు విశాఖపట్నం వేదికగా నిలవనుంది.



# సన్‌రైజర్స్ అదరగొట్టింది.. రాజస్థాన్‌పై ఘన విజయం

**రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

**హైదరాబాద్:** ఐపీఎల్ 2025 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ విజయంతో ఆరంభించింది. హైదరాబాద్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ కొండంత లక్ష్యఛేదనలో రాజస్థాన్ 242/6 పరుగులకు పరిమితమైంది. ధ్రువ్ జురెల్ (70; 35 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), సంజు శాంసన్ (66; 37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు)ల పోరాటం సరిపోలేదు. యశస్వి జైస్వాల్ (1), రియాన్ పరాగ్ (4) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. చివర్లో షిమ్రాన్ హెట్‌మయర్ (42; 23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), శుభమ్ దూబె (34*; 11 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా అప్పటికే రాజస్థాన్ ఓటమి ఖరారైపోయింది. హైదరాబాద్ బౌలర్లలో సిమర్‌జిత్ సింగ్ 2, హర్షల్ పటేల్ 2, మహ్మద్ షమి, ఆడమ్ జంపా ఒక్కో వికెట్ పడగొట్టారు.

హైదరాబాద్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్ (67; 31 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించగా.. తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (106*; 47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఉప్పెనలా విరుచుకుపడ్డాడు. హెడ్ 21 బంతుల్లో అర్ధ శతకం అందుకోగా.. ఇషాన్ 45 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (34; 14 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (30; 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ శర్మ (24; 11 బంతుల్లో 5 ఫోర్లు) కూడా క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే 3, మహీశ్ తీక్షణ 2, సందీప్ శర్మ ఒక వికెట్ పడగొట్టారు. జోఫ్రా ఆర్చర్ నాలుగు ఓవర్లలో ఏకంగా 76 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో చరిత్రలో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు.







# ముంబయి ఓటమి..

ఐపీఎల్ 18వ సీజన్‌లో చెన్నై జట్టు బోణీ కొట్టింది. ముంబయిపై 4 వికెట్ల తేడాతో గెలుపొందింది

# బోణీ కొట్టిన చెన్నై సూపర్ కింగ్స్

**చెన్నై:** ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ శుభారంభం చేసింది. చెపాక్ స్టేడియంలో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 156 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రుతురాజ్ గైక్వాడ్ (53; 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), రచిన్ రవీంద్ర (65*: 45 బంతుల్లో 4 సిక్స్‌లు, 2 ఫోర్లు) అర్ధ శతకాలతో చెలరేగారు. రవీంద్ర జడేజా (17) పరుగులు చేశాడు. రాహుల్ త్రిపాఠి (2), శివమ్ దూబె (9), దీపక్ హుడా (3) విఫలమయ్యారు. మొదట్లో తేలిపోయిన ముంబయి బౌలర్లు తర్వాత పుంజుకోని వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, రచిన్ చివరి వరకు క్రీజులో ఉండి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ముంబయి బౌలర్లలో అరంగేట్ర ఆటగాడు విఘ్నేశ్ పుతూర్ (3/32) ఆకట్టుకున్నాడు. దీపక్ చాహర్, విల్ జాక్స్ తలో వికెట్ తీశారు.

**బ్యాటింగ్‌లో తేలిపోయిన ముంబయి..**

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయి.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. తిలక్ వర్మ (31; 25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. సూర్యకుమార్ యాదవ్ (29; 26 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. రోహిత్ శర్మ డకౌటవ్వగా.. నమన్ ధీర్ (17), రియాన్ రికెల్‌టన్ (13), విల్ జాక్స్ (11), రాబిన్ మింజ్ (3), మిచెల్ శాంట్నర్ (11) పరుగులు చేశారు. చివర్లో దీపక్ చాహర్ (28; 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడటంతో ముంబయి స్కోరు 150 దాటింది. 36 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ముంబయిని తిలక్, సూర్యకుమార్ ఆదుకున్నారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. తర్వాత ముంబయి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. సీఎస్కే బౌలర్లలో నూర్ అహ్మద్ 4, ఖలీల్ అహ్మద్ 3, రవిచంద్రన్ అశ్విన్, నాథన్‌ఎల్లిస్ తలో వికెట్ పడగొట్టారు

**ఓటముల్లో ముంబయి సెంటిమెంట్**

కొన్నేళ్లుగా ఐపీఎల్ సీజన్ ఆరంభ మ్యాచ్‌ల్లో ఓటమిపాలవుతున్న ముంబయి ఇండియన్స్.. తాజా మ్యాచ్‌లో చెన్నై చేతిలో ఓడటంతో ఈ సారి కూడా ఆ సెంటిమెంట్‌ని కొనసాగించినట్లయింది. సీజన్ ఆరంభ మ్యాచ్‌ల్లో ముంబయికిది వరుసగా 13వ ఓటమి. ఆ జట్టు చివరగా 2012లో తమ తొలి మ్యాచ్‌లో గెలిచింది.

## ‘టీమ్‌ఇండియా’కు.. ‘ఇండియన్స్’కు దూరం..

# కట్ చేస్తే 45 బంతుల్లోనే సెంచరీ

**గత కొంతకాలంగా భారత జట్టుకు దూరంగా ఉన్న ఇషాన్ కిషన్ ఐపీఎల్ 2025లో తొలి మ్యాచ్‌లోనే శతకం బాదేసి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.**

వివిధ కారణాల రీత్యా గత కొంతకాలంగా భారత జట్టుకు దూరంగా ఉన్న ఇషాన్ కిషన్ ఐపీఎల్ 2025లో తన తొలి మ్యాచ్‌లోనే శతకం బాదేసి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. గత సీజన్ వరకు ముంబయి ఇండియన్స్‌లో కీలక ఆటగాడిగా ఉన్న ఇతను ఆ జట్టు రిటైన్ చేసుకోకపోవడంతో వేలంలోకి వచ్చాడు. మెగా వేలంలో అతడిని సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.11.20 కోట్లు వెచ్చించి దక్కించుకుంది. భారీ ధరకు న్యాయం చేస్తూ సన్‌రైజర్స్ తరఫున తొలి మ్యాచ్‌లో శతకం బాది అభిమానుల మనసు దోచుకున్నాడు. రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇషాన్ (106*; 47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఉప్పెనలా విరుచుకుపడ్డాడు. అతను ఫోర్లు, సిక్సర్లు బాదుతుంటే అభిమానుల కేరింతలతో ఉప్పల్ స్టేడియం మార్మోగింది. ఈ సూపర్ ఇన్నింగ్స్‌తో ఇషాన్‌ను మళ్లీ భారత జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.



భారత్ తరఫున చివరగా నవంబర్, 2023లో ఆడిన ఈ కుర్రాడు జట్టులో అనుహ్యంగా చోటు కోల్పోయాడు. కొన్నాళ్ల క్రితం వరకు వన్డేలు, టీ20ల్లో టీమ్‌ఇండియాకు కీలకంగా ఉండేవాడు. వికెట్‌కీపర్‌గా, బ్యాటర్‌గా అదరగొట్టాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన అతికొద్ది మంది బ్యాటర్లలో ఇషాన్ కూడా ఒకడు అంటే.. అతడి ప్రతిభ ఎలాంటి అర్థం చేసుకోవచ్చు. జాతీయ జట్టుకు ఆడనప్పుడు దేశవాళీలో ఆడాలని బీసీసీఐ ఆదేశాలు జారీ చేయగా.. ఇషాన్ పెడచెవినపెట్టాడు. దీంతో అతడిని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి బీసీసీఐ తప్పించింది. దీంతో 2024లో ఇషాన్ ఐపీఎల్‌లోనే ఆడాడు. తర్వాత వెనక్కి తగ్గిన కిషన్ దేశవాళీ క్రికెట్ ఆడాడు. బుచ్చిబాబు టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేశాడు. దీంతో దులీప్ ట్రోఫీలోనూ చోటు దక్కించుకున్నాడు. ఇండియా సి తరఫున 126 బంతుల్లోనే 111 పరుగులు చేసి జాతీయ జట్టులోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని సెలక్టర్లకు గట్టి సందేశం పంపాడు. తర్వాత రంజీ ట్రోఫీలో ఝార్ఖండ్‌కు కెప్టెన్సీ వహించి శతకం కూడా బాదాడు. విజయ్ హాజారే ట్రోఫీలో శతక్కొట్టాడు. ఇప్పుడు ఐపీఎల్‌లోనూ మెరుపు సెంచరీతో అలరించాడు. ఈ మెగా టోర్నీలో మున్ముందు ఇదే జోరు కొనసాగిస్తే మళ్లీ ఇషాన్ జాతీయ జట్టులోకి రావడం ఖాయం.

**పాతుకుపోతాడా?**

2016లో గుజరాత్ లయన్స్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసిన ఇషాన్.. 2018లో రూ.6.20 కోట్లకు ముంబయి ఇండియన్స్‌లో చేరాడు. 2018, 2019లో ఆకట్టుకోలేదు. 2020 సీజన్ నుంచి ముంబయిలో కీలక ఆటగాడిగా మారాడు. 2020లో 516 పరుగులు చేసి జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో ముఖ్యభూమిక పోషించాడు. రోహిత్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేస్తూ ఎన్నో మరుపురాని ఇన్నింగ్స్‌లు ఆడాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ధనాధన్ ఆటతీరుతో ఆదుకున్న సందర్భాలూ ఉన్నాయి. ప్రతి సీజన్‌లో నిలకడగా ఆడటంతో ముంబయి అతని పారితోషికాన్ని కూడా భారీగా పెంచింది. 2022 నుంచి 2024 వరకు ఒక్కో ఏడాదికి రూ.15.25 కోట్లు అందుకున్నాడు. ముంబయి ఇండియన్స్‌లో ఓ వెలుగు వెలిగిన ఇషాన్.. సన్‌రైజర్స్‌లోనూ అదే స్థాయిలో రాణించేలా తొలి మ్యాచ్‌లో రప్ఫాడించాడు.

# వారెవ్వా ధోని.. కేవలం 0.12 సెకన్లలోనే!

ఎంఎస్ ధోని.. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ వికెట్ కీపర్ బ్యాటర్లలో ఒకడిగా పేరు సంపాదించుకున్నాడు. ఈ జార్ఖండ్ డైన్‌మేట్.. విధ్వంసకర బ్యాటింగ్‌తో పాటు అద్భుతమైన వికెట్ కీపింగ్ స్కిల్స్‌కు పెట్టింది పేరు. తాజాగా ధోని మరోసారి తన కీపింగ్ స్కిల్స్‌తో అభిమానులను అలరించాడు.

ఐపీఎల్ 2025లో చెపాక్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సీఎస్‌కే తరఫున ఆడుతున్న ధోని.. అద్భుతమైన స్టంపింగ్‌తో మెరిశాడు. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను మెరుపు స్టంప్ ఔట్ చేసి ధోని పెవిలియన్‌కు పంపిచాడు.

**అసలేమి జరిగిదంటే?**

ముంబై ఇన్నింగ్స్ 11 ఓవర్ వేసిన లెగ్ స్పిన్నర్ నూర్ అహ్మద్.. మూడో బంతిని సూర్యకు గూగ్లీగా సంధించాడు. ఆ బంతిని సూర్యకుమార్ క్రీజు నంచి బయటకు వచ్చి షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ బంతి అద్భుతంగా టర్న్ అయ్యి అతడి బ్యాట్‌ను మిస్ అయ్యి వికెట్ల వెనక ఉన్న ధోని చేతికి వెళ్లింది.ఈ క్రమంలో మిస్టర్ కూల్.. తన వింటేజ్ స్టైల్‌లో రెప్పపాటులో బెయిల్స్‌ను పడగొట్టాడు.



ఫీల్డ్ అంపైర్ థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేసినప్పటికి.. సూర్య మాత్రం కనీసం వెనక్కి తిరగకుండా మైదానం విడిచివెళ్లిపోయాడు. ధోని కేవలం 0.12 సెకండ్ల వ్యవధిలోనే స్టంప్ ఔట్ చేయడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ(31) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ఆఖరిలో దీపక్ చాహర్(28) కీలక ఇన్నింగ్స్ ఆడారు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ అహ్మద్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. ఖాలీల్ అహ్మద్ మూడు వికెట్లు సాధించాడు.